నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I హైదరాబాద్, గురువారం 3 ఏప్రిల్ 2025 SANGAREDDY

## పటాన్‌చెరు కోఆర్డినేటర్‌గా ఆదర్శ్‌రెడ్డి

**నియమించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**



అధినేత కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో ఆదర్శ్‌రెడ్డి

పటాన్‌చెరు, ఏప్రిల్ 2: బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా వెన్నవరం ఆదర్శ్‌రెడ్డిని అధినేత కేసీఆర్ నియమించారు. మంగళవారం ఎర్రవల్లిలో ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా వెన్నవరం ఆదర్శ్‌రెడ్డిని కేసీఆర్ ప్రకటించారు. ఆదర్శ్‌రెడ్డికి కేటీఆర్, హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పటాన్‌చెరులో పార్టీని అజేయశక్తిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. తనపై నమ్మకంతో గురుతర బాధ్యత అప్పగించిన కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్, కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఆదర్శ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ నేతలు సమావేశం అయ్యారు. ఏప్రిల్ 27న బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్‌లో నిర్వహించే బహిరంగ సభకు జన సమీకరణ తదితర అంశాలపై కేసీఆర్ వారికి దిశానిర్దేశం చేశారు. ఇప్పటి నుంచే నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. ప్రతి గ్రామంలో జెండాలు ఆవిష్కరించి జన సమీకరణ చేయాలని సూచించారు.

## ప్రభాకర్..దుబ్బాక ఎలా ఉంది..

**ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి కేసీఆర్ ఆప్యాయ పలకరింపు**



దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

దుబ్బాక, ఏప్రిల్ 2 : ప్రభాకర్..బాగున్నావా, మన దుబ్బాక ఎలా ఉంది. నియోజకవర్గంలో పరిస్థితులు ఎట్లా ఉన్నాయి అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని తెలంగాణ తొలి సీఎం,బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ముచ్చటించారు. బుధవారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ నేతలతో రజతోత్సవ మహాసభ గురించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో కేసీఆర్ కాసేపు ఆప్యాయంగా మాట్లాడారు. కేసీఆర్ దుబ్బాక నియోజకవర్గం గురించి, ప్రజల గురించి అడిగి తెలుసుకున్నారు. సార్.. దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు మీరంటే ఎనలేని అభిమానం ఉందని, మీతో ఆత్మీయ అనుబంధం ఉందని, మిమ్మల్ని కలవాలని పార్టీ నియోజకవర్గ శ్రేణులు ఎంతో ఆశపడుతున్నారని కేసీఆర్‌తో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దీనికి కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ తర్వాత రాష్ట్రంలో మొదట దుబ్బాక నియోజకవర్గ పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహిద్దామని చెప్పారు. రజతోత్సవ మహాసభకు దుబ్బాక నియోజకవర్గం నుంచి భారీ జనసమీకరణ చేయాలని ఎమ్మెల్యేకు సూచించారు.

## కేజీబీవీ నుంచి విద్యార్థి అదృశ్యం

పాపన్నపేట, ఏప్రిల్ 2: తల్లిదండ్రులు లేని ఒక విద్యార్థిని కలెక్టర్ తీసుకొచ్చి పాపన్నపేట కేజీబీవీలో జాయిన్ చేస్తే సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా విద్యార్థి అదృశ్యమైన సంఘటన బుధవారం పాపన్నపేట కేజీబీవీలో వెలుగుచూసింది. బాలసదనంలో అనాథగా ఉన్న బాలికను మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఇటీవల స్వయంగా తీసుకొచ్చి హాస్టల్‌లో ఎనిమిదో తరగతిలో జాయిన్ చేశారు. ఆ బాలికను కంటికి రెప్పలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల ఎస్‌వోగా బాధ్యతలు చేపట్టిన బాలలక్ష్మి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే విద్యార్థిని అదృశ్యమైందని ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చాలామంది సిబ్బంది నైట్ డ్యూటీకి గైర్హాజరవుతున్నారని, ఒకరిద్దరు తప్పా మిగతావారు సమయపాలన పాటించడం లేదని, అయినా చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పాఠశాల చుట్టూ ప్రహరీ ఉన్నా విద్యార్థి ఉదయం అటెండెన్స్ అనంతరం అదృశ్యం కావడం వెనుక అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. ఈ విషయమై డీఈవోతోపాటు బాలసదనం సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు పాఠశాలకు చేరుకొని విచారణ జరిపినట్లు తెలిసింది.

# తడారిన చేను...
# తల్లడిల్లిన రైతు



సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని కూటిగల్‌లో నీరు లేక ఎండిపోయిన రైతు చేవల్ల బలరాములు వరి పొలం



సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని బెక్కల్‌లో సన్నటి ధారగా పోస్తున్న బోరు

## జనగామ నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో ఎండిన పంటలు

- తీవ్ర ఆందోళనలో చేర్యాల, ధూళిమిట్ట, మద్దూరు, కొమురవెల్లి రైతులు
- పట్టించుకోని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు
- తమ గోస ఆలకించే వారే కరువయ్యారని అన్నదాతల ఆవేదన
- తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్లు ఉన్నా..ప్రయోజనం సున్నా..
- ఏ ఊరిలో చూసినా ఎండిన పొలాలే దర్శనం
- బోర్లు తవ్వించి బొక్కబోర్ల పడుతున్న రైతులు
- అప్పులే మిగిలాయంటూ కన్నీరు
- కేసీఆర్ ప్రభుత్వంలో జలసవ్వడులు...నేడు కరువుఛాయలు

'కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు మంచిగ చెరువులు, కుంటలు నింపిండ్రు. కాల్వలకు నీళ్లు వదిలిండ్రు. పదేండ్లలో ఎన్నడూ సాగునీళ్లకు రంది లేకుండే. పంటలు బాగా పండినయి. కాంగ్రెస్ సర్కారొచ్చినంక పంటలు ఎండిపోతున్నాయి. ఈఏడు బాగా గోస ఉంది.ఇంత ముందెప్పుడు గిట్ల కరువు రాలే. ఇప్పుడు నీళ్లు ఇడుసేటోళ్లు లేరు. రైతులను పట్టించుకునేటోళ్లు లేరు. ప్రజాప్రతినిధులు మాదిక్కు రావడమే మానేశారు'.. అని జనగామ నియోజకవర్గంలోని చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట, కొమురవెల్లి మండలాల రైతులు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

సిద్దిపేట, ఏప్రిల్ 02(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, ధూళిమిట్ట, మద్దూరు, కొమురవెల్లి మండలాల్లో సాగునీరందక వేలాది ఎకరాల్లో వరిపంట ఎండిపోతున్నది. బీఆర్ఎస్ హయాంలో ఏటా సాగునీటిని విడుదల చేసి, ఈ ప్రాంత చెరువులు, కుంటలు పూర్తిగా నింపడంతో పుష్కలంగా పంటలు పండాయి. చెరువులు, కుంటలు, వాగులు మండుటెండల్లో జలకళతో ఉట్టిపడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితి లేదు. ప్రస్తుతం ఎటుచూసినా నెర్రెలిడిన పొలాలు, బోసిపోయిన చెరువులు, వాగులు కనిపిస్తున్నాయి. పొలాలు ఎండిపోవడంతో రైతులు పశువులకు వదిలేశారు. కొంత మంది రైతులు చివరి పంటను కాపాడుకోవడానికి అప్పులు తెచ్చి బోర్లు వేయిస్తున్నా ప్రయోజనం లేకుండా పోయింది. 'నమస్తే తెలంగాణ' బృందం బుధవారం ధూళిమిట్టతో పాటు కూటిగల్, కొండాపూర్, బెక్కల్, లద్నూరు రిజర్వాయర్ కింద రేబర్తి, గాగిళ్లాపూర్, మర్మాముల, సలాక్‌పూర్, ధర్మారం,మద్దూరు గ్రామాలను సందర్శించి రైతుల గోస తెలుసుకుంది. ఎక్కడ చూసినా పంటలు ఎండిపోయి రైతుల కండ్లలో కన్నీళ్లు కనిపించాయి. చేతికందిన పంట ఎండిపోవడంతో అప్పులు ఎలా తీర్చేది అంటూ రైతులు కన్నీటి పర్యంతం అయ్యారు. రైతులు పంటలను కాపాడుకోవడం కోసం భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. బోరుబావుల తవ్విస్తున్నారు. ఒక్కో గ్రామంలో సరాసరి 15 నుంచి 20 వరకు బోర్లు తవ్వించారు. కొన్ని గ్రామాల్లో 50 నుంచి 60 వరకు బోర్లు తవ్వించారు. ఒక్క ఆకునూరు గ్రామంలోనే ఈ సీజన్‌లో ఇప్పటికే 100కు పైగా బోర్లు తవ్వించినట్లు పరిశీలనలో తెలిసింది. వాగు పరీవాహక ప్రాంతమైన ఆకునూరు గ్రామ పరిస్థితి ఇలా ఉంటే, మిగతా గ్రామాల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. చేర్యాల, ధూళిమిట్ట, మద్దూరు, కొమురవెల్లి మండలాల్లో 2600 ఎకరాల్లో వరిపంట ఎండిపోయింది. తమను ఆదుకోవడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుకు రావడం లేదని, సాగునీళ్లు ఇవ్వక పోవడంతోనే తమ పంటలు ఎండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



దూళిమిట్ట మండలంలోని శివాలితండాలో ఎండిపోయిన చెరువు



సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని బైరాన్ పల్లి గ్రామంలో ఎండిన వరి చేనును బతికించుకోవడానికి కొత్తగా బోరు వేసిన రైతు



సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలో నీరులేక ఎడిపోయిన మోయతుమ్మెద వాగు



తోర్నాల వద్ద ఎండిన మోయ తుమ్మెద వాగు

### కేసీఆర్ ప్రభుత్వంలో జలసవ్వడులు...

కేసీఆర్ ప్రభుత్వ ఉన్నప్పుడు ఈ ప్రాంతంలో ఎటుచూసినా గోదావరి జలసవ్వడులు కనిపించాయి. కాంగ్రెస్ సర్కార్ వచ్చాక ఎటుచూసినా ఎండిన చెరువులు, అడుగంటిన బోరుబావులు, డెడ్‌స్టోరేజీలో రిజర్వాయర్లు, ఎండిన పంటలు కనిపిస్తున్నాయి. ఏ ఊరికెళ్లి చూసినా పంటలను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నారు. నీటికోసం రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ఇంత చేసినా పంట చేతికి వచ్చే పరిస్థితి లేదు. వేలాది ఎకరాలకు సాగునీరు అందించే తపాస్‌పల్లి రిజర్వాయర్ డెడ్‌స్టోరేజీకి చేరింది. లద్నూరు రిజర్వాయర్‌లో చుక్కనీరు లేదు. పంట కాల్వలు పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉన్నాయి.

### సాగునీటి పనులన్నీ పెండింగ్...

మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాలు విడుదల చేయాలని నాడు కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించింది. కరువు ప్రాంతంగా పిలువబడే చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలు గోదావరి జలాలు అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించింది. లింకు కాల్వల నిర్మాణానికి రూ. 388.20 కోట్లు కేసీఆర్ మంజూరు చేశారు. నిధులతో లింకు కాల్వల నిర్మాణాన్ని చేపట్టి మల్లన్నసాగర్ రిజర్వాయర్ ద్వారా గోదావరి జలాలను తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపాలని సంకల్పించారు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దేవాదుల (చొక్కారావు ఎత్తిపోతల పథకం ) ఫేస్-2,3 ద్వారా తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపుతున్నారు. నాడు కేసీఆర్ ఈ ప్రాంతానికి ఇచ్చిన మాట ప్రకారం భారీగా నిధులు కేటాయించి పనులు చేయించారు. దాదాపు 40శాతం మేర పనులు పూర్తయ్యాయి. ఎన్నికలు వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో పనులకు బ్రేకులు పడ్డాయి. ఇక్కడి ప్రజాప్రతినిధులు పనుల పూర్తికి కృషి చేయకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది. పనులను పూర్తి చేసి ఉంటే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుండే..దాదాపుగా ఈ ప్రాంతంలో 1,29,630 ఎకరాలకు సాగునీరు అందేది. చేసిన పనులకు బిల్లులు కాంగ్రెస్ సర్కార్ ఇవ్వకపోవడం, భూసేకరణ చేయక పోవడంతో సాగునీటి పనుల్లో పురోగతి కరువైంది.



మద్దూరు మండలంలోని ధర్మారంలో ఎండిపోయిన దేవాదుల కాలువ

జనగామ నియోజకవర్గంలోని చేర్యాల ప్రాంతంలో తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్లు ఉన్నాయి. బీఆర్ఎస్ పాలనలో ఈ రెండు రిజర్వాయర్లకు నీటిని నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారు. ప్రస్తుతం రిజర్వాయర్ల నుంచి నీళ్లందక చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలతో పాటు జనగామ జిల్లాలోని

### రిజర్వాయర్లు ఉన్నా నీళ్లు లేవు..

బచ్చన్నపేట రైతులు అరిగోస పడుతున్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌లో చుక్కనీరు లేక బోసిపోయి దర్శనమిస్తున్నది. బీఆర్ఎస్ హయాంలో ఏటా పంపింగ్ చేసి చెరువులు, కుంటలు నింపి పంటలకు సాగు నీరు అందించారు.రంగనాయకసాగర్ నుంచి కొన్ని గ్రామాలకు సాగునీరు అందించేవారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఎండిన చెరువులే కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం నీటిని విడుదల చేయలేదు. ఫలితంగా రైతులు పంటలను కాపాడుకోవడానికి ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోస్తున్నారు. మరి కొంతమంది రైతులు బావుల్లో పూడిక తీయిస్తున్నారు. కొత్తగా బోర్లు తవ్విస్తున్నారు. ఏం చేయలేని రైతులు ఎండిన పంట పొలాలను పశువులకు మేతకు వదిలేస్తున్నారు. 0.5 టీఎంసీల సామర్థ్యంతో లద్నూరు రిజర్వాయర్‌ను అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వినియోగంలోకి తెచ్చారు. ఈ రిజర్వాయర్ ద్వారా రైతులకు సాగునీటిని అందించారు. దీంతో ప్రధాన చెరువులు నిండుకుండలా కనిపించాయి. ప్రస్తుతం లద్నూరు రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేయకపోవడంతో బోసిపోయి కనిపిస్తున్నది. చెరువులు ఎండిపోయాయి. పంటలు ఎక్కడికక్కడ ఎండిపోయాయి. తపాస్‌పల్లి రిజర్వాయర్ కింద అదే పరిస్థితి ఉంది.

### కేసీఆర్ ఉన్నప్పడే బాగుండే..



నేను ఏడెకరాల్లో వరి పంట వేసిన. శివరాత్రి వరకు బాయిల నీళ్లు బాగానే ఉండే. చెరువు ఎండిపోంగనే బావి ఎండిపోయింది. బోరు కుండడన్నీ నీళ్లు మాత్రమే పోస్తున్నది. రోజుకొక్క మడి కూడా పారుతలేదు. గ్రౌండ్ వాటర్ తగ్గి బోరుబావుల్ల నీళ్లు లేకుండా పోయినయి. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు చెరువులు, కుంటలు నింపిండు. కాల్వలకు నీళ్లు వదిలిండు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు నీళ్లకు గోసలేకుండే. అప్పుడు పంటలు మంచిగ పండినయి. ఇప్పుడు నీళ్లు ఇడుసేటోళ్లు లేరు. రైతులను పట్టించుకునేవాళ్లు లేరు.ప్రభుత్వం రైతుభరోసా కూడా సక్కగ ఇస్తలేదు.

-వంగపల్లి వెంకటయ్య, రైతు, రేబర్తి(మద్దూరు మండలం

### పొలమంతా పగుళ్లు పట్టింది..



నేను నాలుగెకరాల్లో వరి పంట పెట్టిన. బోర్లల్ల నీళ్లు లేకుండా పోయినయి. పొలమంతా పగుళ్లు పడింది. నాలుగు రోజులకొక్కసారి మడికి తడి తిరుగుతంది. ఇంకా నెల రోజులయితే బయట పడుతం. ఈనెల రోజులు పొలం ఎట్ల పారుతదో నని భయపడుతున్నం. ఇంతకుముందు మంచిగనే పొలం పారేది. ఇప్పుడేమైందో బోరుబావులల్ల నీళ్లు మొత్తం పోయినయి. కొత్తగా బోరువేసిన. చెరువు, కుంటలు నింపితే బోరుబాయిలల్ల నీళ్లు ఉండేవి.బీఆర్ఎస్ ఉన్నప్పుడు నీళ్లకు గోసలేకుండే.

-చెవ్వొళ్ల బాలరామయ్య, రైతు, కూటిగల్(ధూళిమిట్ట మండలం)

### అప్పుడు చెరువులు, కుంటలు నింపేది



నేను రెండెకరాల్లో వరి పంట వేసిన. వరి పంటకు రూ. 50వేలు పెట్టుబడి పెట్టిన. ఈ ఏడాది పెట్టుబడి మీద పడ్డది. బోర్లు మొత్తం ఎండిపోయినయి. వరి పొట్టదశలో ఎండిపోతున్నది. బీఆర్ఎస్ సర్కారు ఉన్నప్పుడు మంచిగా చెరువులు, కుంటలు నింపడం వల్ల కరువు అనేది లేకుండా పోయింది. అప్పుడు పంటలు మంచిగా పండినయి. చెరువు, కుంటలు నింపితే బోరుబాయిలల్ల నీళ్లు ఉండేవి. ఇప్పుడు నీళ్ల సౌలత్ లేక ఇప్పుడు పంటలు ఎండిపోతున్నయి. పంటలు ఎండిపోవడం వల్ల అప్పులపాలయినం. ప్రభుత్వం ఆదుకోవాలే, లేకపోతే రైతులకు చావులే దిక్కవుతయి.

-ధరావత్ తౌరియా, రైతు, శిబ్బితండా(ధూళిమిట్ట మండలం)



ఎండిపోయి, పిచ్చిమొక్కలతో నిండిన సిద్దిపేట జిల్లా ధూళిమిట్టలోని రంగనాయక సాగర్ కాల్వ



డెడ్ స్టోరేజ్‌కి చేరినసి సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని లద్నూర్ రిజర్వాయర్



ఎండిపోయిన సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట చెక్ డ్యామ్